సాక్షి
ఆదిలాబాద్
9
బుధవారం । 27 । ఆగస్టు । 2025

నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

ఆదిలాబాద్: వినాయక చవితి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ఆవరణలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

న్యూస్‌రీల్

30న ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

కైలాస్‌నగర్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ /అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లలో 2025–26 సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్ల గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు http:// ititelangana. gov. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు కాపీ, అన్ని నిజ ధ్రువ పత్రాలతో ఆదిలాబాద్ ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 9493535378 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అందుబాటులో 858 మెట్రిక్ టన్నుల యూరియా

ఆదిలాబాద్: జిల్లాలో 858 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 29,531.17 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. యూరియాను పక్క రాష్ట్రాలకు సరఫరా చేయడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎరువును ఒకే సారి కాకుండా దఫాలుగా వాడాల్సి ఉంటుందని, విషయాన్ని రైతులు గమనించి ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, సమీపంలోని పీఏసీఎస్‌తో పాటు మండలంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద తీసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో పంట ఎదుగుదల కోసం నానో యూరియాను వినియోగించాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే 89777 42856 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: అగ్నిపథ్ భారత వైమానిక దళంలో క్లరికల్, టెక్నికల్ కేడర్లలో ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. పురుష అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 5గంటలకు, మహిళా అభ్యర్థులు సెప్టెంబర్ 5న ఉదయం 5 గంటలకు చెన్నైలోని తాంబరం 8 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లో అగ్నిపథ్ నియామక ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. అవివాహితులు, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్ కోర్సు, 152సెం.మీ. ఎత్తు కలిగి ఉండి, 17 నుంచి 21 ఏళ్లలోపు యువత అర్హులని తెలిపారు. https:// agnipathvayu. cdac. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం

ఆదిలాబాద్: వ్యాయామంతో అన్ని వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు దేవిదాస్ దేశ్‌పాండే, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీఎంలకు స్మార్ట్‌ఫోన్లు అందజేత

కైలాస్‌నగర్: చేయూత పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన స్మార్ట్ ఫోన్లను కలెక్టర్ రాజర్షి షా మంగళవారం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ల (బీపీఎం)కు అందజేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని 158 మందికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన సెల్‌ఫోన్‌తో పాటు ఫింగర్ ప్రింట్‌మిషన్‌లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పారదర్శకంగా పింఛన్ అందజేయాలని సూచించారు. ఇందులో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, ఏపీఎం ప్రకాశ్ తదితరులున్నారు.

ముదిరిన వివాదం



ఇది తలమడుగు మండలం దేవాపూర్‌లో 33 కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభం. ఓ టిప్పర్ ఈ స్తంభాన్ని ఢీకొట్టడంతో దీంతో పాటు మరో రెండు పోల్స్ కూడా నేలకొరిగాయి. అయితే విద్యుత్ శాఖ వర్క్స్ చేపట్టే కాంట్రాక్టర్లు ఓ అధికారి తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో ఆ పనులు చేపట్టమని చెప్పారు. దీంతో సోమవారం సుమారు ఆరు గంటల పాటు 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తప్పని పరిస్థితుల్లో ఆ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. తమ సిబ్బంది ద్వారా పూర్తి చేశారు. అయితే కరెంట్ సరఫరా పునరుద్ధరించడంలో మాత్రం ఆలస్యం జరిగింది.

- విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్లు వర్సెస్ ఆఫీసర్లు
- బిల్లుల విషయంలో ఓ అధికారి తీరుపై నిరసన
- క్షేత్రస్థాయిలో పనులపై ప్రభావం
- ఉన్నతాధికారుల పట్టింపులేమిపై విమర్శలు



విద్యుత్ శాఖ డీఈ ఈదన్న (ఇన్‌సెట్‌లో)తో మంగళవారం కాంట్రాక్టర్ల చర్చలు

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ముందస్తు నోటీసు ఇచ్చి మూడు రోజులుగా పనులు నిలిపివేశారు. ఈ ప్రభావం క్షేత్రస్థాయిలో పడింది. సాధారణంగా కాంట్రాక్టర్ల దగ్గర మిషనరీలు ఉండడంతో చకచకా పనులు చేసే పరిస్థితి ఉంటుంది. అయితే ప్రస్తుతం అత్యవసర పరిస్థితులు ఎదురైతే చక్కదిద్దడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. కారణం.. శాఖ సిబ్బంది వద్ద సరైన మిషనరి ఉండకపోవడమే. ఈ పరిస్థితుల్లో వారు చిన్న పనులు కూడా చక్కబెట్టేందుకు సమయం తీసుకుంటున్నారు. నిమిషాల్లో పూర్తి కావాల్సిన పనులు సైతం గంటలు పడుతుండడం గమనార్హం. ప్రస్తుతం వర్షాకాలం కావడం, అలాగే గణేశ్ నవరాత్రోత్సవాలు మొదలవుతుండగా అత్యవసరంగా ఏదైన పనులు ఏర్పడితే విద్యుత్ శాఖ అధికారులకు ఉరుకులు పరుగులు తప్పని పరిస్థితి. పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వివాదం ఏమిటి..

వర్క్స్‌కు సంబంధించి బిల్లులను జిల్లా కేంద్రంలోని అకౌంట్ సెక్షన్‌లో కాంట్రాక్టర్లు అందజేస్తారు. వాటిని ఆ సెక్షన్ ఆఫీసర్లు పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించాలి. అయితే ఓ అధికారి ఆ బిల్లుల పరిశీలనతో పాటు వాటిని ఉన్నతాధికారులకు పంపించడంలో అంతులేని జాప్యం చేస్తున్నారని,ఈ తాత్సారం విషయంలో ప్రశ్నించినా మార్పు రావడం లేదని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.దీంతో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేని పరిస్థితిలోనే పనులు నిలిపివేయాల్సి వచ్చిందని అంటున్నారు.

సెక్షన్‌లో ఓ అధికారి తీరు మారట్లేదు..



విద్యుత్ శాఖ అకౌంట్ సెక్షన్‌లో ఓ అధికారి తీరు మారడం లేదు. కాంట్రాక్టర్లు బిల్లు సబ్మిట్ చేసిన తర్వాత తన పరిధిలోనే నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జిల్లా పరిధిలో సుమారు రూ.60లక్షలకు పైగా బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి.

– ప్రకాశ్ జాదవ్, విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

అత్యవసర పనులు చేయాలని చెప్పాం..



కాంట్రాక్టర్లు వర్క్‌లు చేయడం నిలిపివేశారు. అయితే అత్యవసరంగా ఏదైన పని ఏర్పడితే చేయాలని చెప్పాం. పెండింగ్ బిల్లుల విషయంలో వారు నిరసనకు దిగారు. ఆదిలాబాద్ డీఈ వారితో చర్చలు జరుపుతున్నారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.

– జేఆర్ చౌహాన్, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఆదిలాబాద్

గణేశ్ ఉత్సవాలకు గట్టి బందోబస్తు

- వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో పోలీసు అధికారులతో ఉత్సవాల నిర్వహణ, బందోబస్తుపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న నవరాత్రోత్సవాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంగా ఉండి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వన్‌టౌన్, టూటౌన్, మావల స్టేషన్ల పరిధిలో 11 సెక్టార్లుగా విభజించి బందోబస్తు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 24 గంటలు నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ గణపతి మండపాన్ని జియోట్యాగ్ చేయనున్నట్లు తెలిపారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో 11 రోజుల పాటు పికెట్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో ఎలాంటి అసత్యప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా బృందం పర్యవేక్షిస్తుందని, ఎవరు చూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

- ఓటర్ల తుది జాబితా ప్రకటనకు ఎన్నికల సంఘం ఆదేశం

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. సెప్టెంబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అవసరమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈఏడాది జూలై 1 నాటికి సిద్ధం చేసిన అసెంబ్లీ నియోజకవర్గ జాబితా ఆధారంగా పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన జాబితా సిద్ధం చేయాలని సూచించింది. వాటిని ఈనెల 28న గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని సూచించింది. అలాగే 29న జిల్లా స్థాయిలో, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించాలని స్పష్టం చేసింది. ఓటరు జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 28 నుంచి 30 వరకు స్వీకరించి 31న వాటిని పరిష్కరించాలని స్పష్టం చేసింది. సెప్టెంబర్ 2న తుది జాబితాను వార్డుల వారీగా అన్ని గ్రామపంచాయతీలు, జిల్లా పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులతో స్థానిక ఎన్నికలు జరగవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో పోటీకి సై అంటున్న ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- వరద బాధితులందరినీ ఆదుకుంటాం
- కలెక్టర్ రాజర్షి షా



బాధిత రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

సిరికొండ: వరద బాధిత రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కొండాపూర్ శివారు చిక్‌మాన్ వాగు సమీపంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సర్వే కొనసాగుతుందని, బాధిత రైతులందరికీ పరిహారం అందేలా చూస్తామన్నారు. కాగా, చిక్‌మాన్ ప్రాజెక్టుకు గేట్లు బిగించాలని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలకేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, ఏవో శ్రద్ధారాణి, ఎంపీవో సంతోష్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, మండల విద్యాధికారి సునీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులున్నారు.

నష్టంపై ప్రణాళికలు రూపొందించాలి

కైలాస్‌నగర్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న వంతెనలు, రహదారులకు సంబంధించి ఆయా శాఖల అధికారులు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన వంతెనల వద్ద రహదారులు గుంతలమయమైనట్లు గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టు సంస్థలే ఆ బాధ్యత తీసుకుని శాశ్వత మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. నీటి ప్రవాహానికి దెబ్బతిన్న కల్వర్టులు, మినీ వంతెనలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం అధికారులు రూపొందించిన ప్రదర్శనను పరిశీలించి, వివిధ శాఖల ప్రణాళికలను సమీక్షించారు. తహసీల్దార్లు మండలాల వారీగా వరద నష్టం వివరాలు సమర్పించాలన్నారు. ఈనెల చివరిలో మరోసారి సమీక్ష ఉంటుందని, పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

- నవ రాత్రుల వేళ.. మా నివేదనల మాల
- విన్నపాలు మన్నించి.. దీవించు వినాయకా



ఏకదంతా.. నమో నమః. ఏటా నీ రాక కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటాం.. చవితి రోజున కొలువుదీర్చి నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలతో కొలుస్తుంటాం.. ఈ సారి కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాం.. ఆది పూజలందుకుని ఆపదలు గట్టెక్కించే విఘ్ననాయకా.. మా కష్టాలు చూడు తండ్రీ.. నీ భక్తులపై వరాలు జల్లు కురిపించు లంబోదరా.. నవ నివేదనలు నీ ముందుంచుతున్నాం.. ఆలకించి మమ్ములను దీవించు గణనాయకా. – ఆదిలాబాద్

రావయ్య గణపయ్య.. ఆలకించవయ్యా



నిన్ను వాడవాడలా కొలువు దీర్చేందుకు మండపాలను సిద్ధం చేసుకున్నాం వక్రతుండా. అయితే నీ శోభాయాత్ర నిర్విఘ్నంగా సాగేందుకు జిల్లాలో చాలా చోట్ల రహదారులు ఛిద్రమయ్యాయి. నీ ఆగమనానికి, నిమజ్జనానికి గుంతలమయైన రోడ్లతో ఇబ్బందులు తప్పేలా లేవు లంబోదరా. మన్నించి రాస్తా సమస్యలు త్వరగా దూరం చేయు పార్వతీతనయా.



అక్షర క్రమంలో ముందున్నా అక్షరాస్యతలో మాత్రం వెనుకబడుతున్నాం స్వామీ. ఈ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలు లేక నీ పిల్లలంతా పెద్ద చదువులకు దూరమవుతున్నారు. నిన్ను మనసారా తలిచి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఉద్యమాన్ని మొదలుపెట్టాం స్వామీ. ప్రభుత్వం త్వరగా కరుణించేలా చూడు చతుర్భుజా.



తలాపునే గంగమ్మ ప్రవహిస్తున్నా.. పంటల సాగు దినదిన గండంగా సాగుతోంది గణాధ్యక్షా. మీ తల్లిని మా పంట చేలకు ప్రాణం పోసేలా చూడు స్వామీ. చనాఖా– కొరటా బ్యారేజ్ త్వరగా అందుబాటులోకి వచ్చేలా అభయమివ్వు అగ్రపూజ్యాయ.



ఆదిలాబాద్ నుంచి భాగ్యనగరానికి వెళ్లడానికి ఎన్నో తిప్పలు పడుతున్నాం గణేశా. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ఆర్థిక భారమవుతోంది. జిల్లా కేంద్రం నుంచి పఠాన్ చెరు వరకు రైల్వేలైన్ ఏర్పాటును త్వరగా పూర్తయ్యేలా చూడు మూషికవాహనా.



ఆకాశంలో విహరించాలనే మా కలలకు రెక్కలను త్వరగా ప్రసాదించు స్వామీ. నీ దీవెనలకు 'సాక్షి' చొరవ, ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల సహకారం తోడవగా కేంద్రం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది లంబోదరా. జిల్లా కేంద్రంలో త్వరగా విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేలా చూడు మోదకప్రియా.



జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు తల్లాడిల్లారు తండ్రీ. పంటలు పోయి, ఆశలపై ఇసుక మేటలు వేశాయి స్వామీ. పత్తి చేలన్నీ వరద తాకిడికి గురై బురదమయయ్యాయి. పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా, అప్పుల బాధ నుంచి గట్టెక్కేలా కాపాడు గణాధిపా.



పూజలో నీకు సమర్పించే వస్త్రాన్ని ఓ సారి చూడు స్వామి. తెల్ల బంగారం పండించే రైతన్నకు కష్టాలు తప్పట్లేదు అగ్రగణ్యా. తేమ పేరుతో దూది రైతుకు ఏటా గిట్టుబాటు దక్కడం లేదు. ఆరుగాలం శ్రమను గుర్తించి మంచి ధర అందేలా చూడు వక్రతుండా.



అటవీ అందాలు, పాలనురుగుల జలపాతాలతో కన్నుల విందు చేసే జిల్లాలో పర్యాటక అభివృద్ధి మాత్రం లేదు స్వామీ. రాష్ట్రంలో ఎత్తైన జలపాతాల్లో ఒకటైన కుంటాల మా దగ్గరే పరవళ్లు తొక్కుతున్నా అభివృద్ధికి మాత్రం అడుగులు పడడం లేదు. జిల్లాలో పర్యాటకం ప్రగతి సాధించేలా కరుణించు గౌరీనందనా.



నిరుపేదలకు వైద్యం అందించే రిమ్స్ ఆసుపత్రి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారయిందయ్యా. రూ.150 కోట్లతో అధునాతన ఆసుపత్రిని నిర్మించినా ఆది నుంచి విఘ్నాలే స్వామీ. ఆసుపత్రి నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నాణ్యమైన సేవలకు మాత్రం నోచుకోని పరిస్థితి. వైద్య పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యేలా చూడు విఘ్నరాజా.

ఇట్లు.. నీ ఆదిలాబాద్ జిల్లా భక్తులు

'రెవెన్యూ'పై ఫోకస్

- అక్రమార్కులకు చెక్
- ప్రక్షాళన దిశగా కలెక్టర్ చర్యలు
- తహసీల్దార్ల బదిలీలకు రంగం సిద్ధం?



కలెక్టర్ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లా పాలనలో కీలకమైన రెవెన్యూ శాఖ ప్రక్షాళన దిశగా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక దృష్టి సారించారు. తన మార్కు పాలనతో అక్రమార్కులకు చెక్ పెడుతున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ధరణి ఆపరేటర్లపై ఇటీవల బదిలీ వేటు వేయగా, తాజాగా తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే మీ సేవ ఆపరేటర్లకు సైతం స్థానచలనం కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో 'మామూలు'గా వ్యవహరిస్తున్న తహసీల్దార్లపై కూడా బదిలీ వేటు తప్పదనే ప్రచారం ప్రస్తుతం ఆ శాఖలో చర్చనీయాంశమైంది.

అవినీతికి ఆస్కారం లేకుండా...

పాలనాపరంగా కీలకమైన రెవెన్యూ శాఖను సంస్కరించే దిశగా కలెక్టర్ ఫోకస్ పెట్టారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారనే కారణంతో జిల్లాలోని ధరణి ఆపరేటర్లపై ఇటీవల బదిలీ వేటు వేశారు. తాజాగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే మీసేవ ఆపరేటర్లను సైతం మూకుమ్మడిగా బదిలీ చేశారు. దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేయడంతో పాటు తహసీల్దార్ డొంగల్ తమ వద్దే ఉంచుకుని అక్రమాలకు పాల్పడినట్లు వారిపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు ఇటీవల చేపట్టిన రేషన్‌కార్డుల జారీలోనూ దళారులతో కుమ్మక్కై పనికో రేటు చొప్పున వసూళ్లకు పాల్పడినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే వారిపై బదిలీ వేటు వేసారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

తదుపరి వంతు తహసీల్దార్లదేనా..?

కలెక్టర్ ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాలపై అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. ధరణి, మీ సేవ ఆపరేటర్లను బదిలీ చేయగా తదుపరి వంతు తహసీల్దార్లదేననే చర్చ ఊపందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో కొంత మంది మండల రెవెన్యూ అధికారులు అక్రమాలకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి రైతుల నుంచి పెద్ద మొత్తంలోనే వసూళ్లను దండుకుంటున్నట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. అలాంటి అధికారుల వ్యవహార శైలీ, పనితీరుపై జిల్లా బాస్ అంతర్గతంగా వివరాలు సేకరించినట్లుగా చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే పలువురు తహసీల్దార్లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణకు వచ్చారని, త్వరలోనే వారిపై బదిలీ వేటు పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వినాయక చవితి పండగ తర్వాత ఏ క్షణమైనా బదిలీ వేటు తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు రెవెన్యూలో అవినీతికి ఆస్కారం లేకుండా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది.

75 మంది టీచర్లకు పదోన్నతి



కజ్జర్ల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడికి రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయుడు కుషాల్ జాడే

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేసింది. ఇందులో భాగంగా 75 మంది ఎస్జీటీలకు ప్రమోషన్ లభించింది. జిల్లాలో మొత్తం 137 పోస్టులు ఖాళీగా ఉండగా, ఆయా కేటగిరీల్లో అర్హత గల ఉపాధ్యాయులు లేకపోవడంతో పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కాలేదు. సోమవారం ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ ఇవ్వగా, మంగళవారం ఉదయం పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వులను విద్య శాఖ అధికారులు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్యంలో 8 మందికి, లోకల్ బాడీలో 67 మందికి పదోన్నతి లభించింది. ప్రభుత్వ యాజమాన్యంలో తెలుగు మీడియంలో ఇద్దరికి పీఎస్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్ గణితంలో 1, సాంఘిక శాస్త్రం 1, హిందీ మీడియంలో సాంఘిక శాస్త్రం 1, ఉర్దూ మీడియంలో సాంఘిక శాస్త్రం 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో ఇద్దరికి పదోన్నతులు లభించాయి. లోకల్‌బాడీలో 28 మందికి పీఎస్ హెచ్‌ఎంలుగా, నలుగురికి స్కూల్ అసిస్టెంట్ హిందీ, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 12, గణితంలో 4, బయోసైన్స్‌లో 5, ఫిజికల్ సైన్స్ 2, సాంఘిక శాస్త్రం 19, ఫిజికల్ ఎడ్యూకేషన్‌లో ఒకరికి పదోన్నతులు లభించాయి. కాగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

క్లుప్తంగా

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం సుందరయ్య కాలనీ వద్ద గల నందనవనం వెనకాల చెట్ల పొదల్లో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.64,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్సెట్టిపేటలో 11మంది..

లక్సెట్టిపేట: మున్సిపాలిటి పరిధిలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం పేకాడుతున్న 11మందిని పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. వారి నుంచి రూ.4,080 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింకపిల్ల మృతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 8 గని సమీపంలో రోడ్డు ప్రమాదంలో జింకపిల్ల మృతి చెందింది. మంగళవారం ఉదయం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఉదయం గని కార్మికులు ప్రమాదాన్ని చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజహర్, బీట్ ఆఫీసర్ సౌజన్య ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి దానిని ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. జింకపిల్ల వయస్సు మూడేళ్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అడవి నుంచి దారి తప్పి ఇటుగా వచ్చి ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో సాత్‌పూల్ వంతెనపై ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. భైంసా డిపోకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం ధర్మాబాద్ వైపు నుంచి భైంసాకు వస్తుండగా, భైంసా వైపు నుంచి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో ధ్వంసం కాగా, డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఏరియాస్పత్రికి తరలించగా, క్షతగాత్రున్ని డీఎం హరిప్రసాద్ పరామర్శించారు. ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

'సరిహద్దు'లో కర్ర గణేశులే..

- సమాజ హితమే వీరి అభిమతం
- ప్రత్యేకత చాటుకుంటున్న 'పాలజ్'
- నేటి నుంచి నవరాత్రోత్సవాలు



మాటేగాంలో వెలసిన కొరడి గణపతి



పాలజ్‌లోని కర్ర గణేశుడు

భైంసా/తానూరు: గణేశ్ నవరాత్రోవాలను నిర్మల్ జిల్లాలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు వినూత్న రీతిలో జరుపుకొంటారు. పీవోపీ, మట్టి విగ్రహాలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. రంగులు, రసాయనాల వినియోగం అస్సలే ఉండదు. హంగులు, ఆర్భాటాలు లేకుండా సమాజహితమే తమ అభిమతమని ఇక్కడి ప్రజలు పూర్వీకులు చూపిన బాటనే నేటికీ అనుసరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా దోహదం చేస్తున్నారు. కర్రతో చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

పాలజ్ గణేశ్ ఫేమస్

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఓ చిన్న మరాఠీ గ్రామం పాలజ్. కుభీర్‌కు పక్కనే మహారాష్ట్రలోని బోకర్ తాలూకాలో ఈ ఊరు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ గ్రామంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలి జనమంతా మంచం పట్టారు. ఇదే సమయంలో వినాయక చవితి పండుగ వచ్చింది. ఓ వైపు కలరా, ప్లేగు వ్యాధులు, మరోవైపు కరువు పరిస్థితులతో జనం సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కర్ర గణపతిని చేయించి ప్రతిష్ఠించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. నిర్మల్ కొయ్యబొమ్మలు చేసే నకాషీ కళాకారుడైన గుండాజీ వర్మను కలిశారు. నిష్ఠతో గుండాజీ వర్మ చేసిన సుందరమైన కర్ర విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరంతా మొక్కితేనే వ్యాధులు దూరమయ్యాయని, కరువు కాటకాలు తొలగిపోయాయని గ్రామపెద్దలు చెబుతారు. అలా 1948 నుంచి కర్ర గణేశుడిని వినాయక ఉత్సవాల్లో కొలవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ఊరి ఆడబిడ్డల ద్వారానే కర్రగణేశుడి గురించి ఇతర గ్రామాలకు తెలిసింది. పూజల అనంతరం నిమజ్జనం రోజున స్థానిక వాగు వద్దకు తీసుకెళ్లి కర్ర గణేశుడికి పూజలు నిర్వహిస్తారు. అక్కడే నీళ్లు చల్లి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. దీనినే నిమజ్జనోత్సవంగా భావిస్తారు. అనంతరం కర్ర విగ్రహాన్ని తిరిగి ఆలయంలోని బీరువాలో భద్రపరుస్తారు.

కలిసికట్టుగా.. లక్షలాదిగా..

తిరుపతి, షిర్డీలో ఉన్నట్లు పాలజ్‌లోనూ భక్తులకు క్యూలైన్లు ఉన్నాయంటే.. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య అంచనా వేయొచ్చు. ప్రతీ ఏడాది వినాయక ఉత్సవాల్లో దాదాపు ఆరు లక్షల నుంచి ఏడు లక్షల మంది భక్తులు పాల్గొంటున్నారని అంచనా. లక్షల్లో తరలివచ్చే భక్తులకు గ్రామస్తులే సేవలందిస్తున్నారు. ఆ ఊరంతా కలిసికట్టుగా కర్రగణేశుడి సేవలో పాల్గొంటుండడం ఇక్కడి విశేషం.

మరికొన్ని గ్రామాల్లోనూ..

తానూరు మండలం బోసిలో వరసిద్ధి కర్ర వినాయకుడు, కుభీర్ మండలం కుభీర్, పార్డి, మాలేగాం చిక్లీ, భైంసా మండలం మాటేగాం, లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామాల్లోనూ కర్ర గణపతులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య పోరాటకాలంలో కరువు నేపథ్యంలో గ్రామస్తుల మొక్కులతో ఇలా ఈ ప్రాంతంలో ఊరంతా కలిసి కర్ర గణపతులను ప్రతిష్ఠించడం మొదలైంది.

పాలజ్‌కు ఎలా వెళ్లాలంటే..

హైదరాబాద్ నుంచి వచ్చేవారు నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకుంటే దూరభారం తగ్గుతుంది. నిర్మల్ మీదుగా వచ్చేవాళ్లు కూడా భైంసా మీదుగానే పాలజ్ వెళ్లాల్సి ఉంటుంది. భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో పాలజ్ ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా ఈ గ్రామానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.

గణపయ్యకు 32 రూపాలు



హిందూ పురాణాల ప్రకారం గణపతి సకల దేవతలకు అధిపతి. పూజ ఏదైనా ముందుగా గణపతినే పూజిస్తారు. ప్రతీ శుభకార్యాన్ని వినాయకుడి పూజతోనే ప్రారంభిస్తారు. అనాధిగా వస్తున్న సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. హిందూ సంప్రదాయాల్లో ఇంటిని నిర్మిస్తే ప్రధాన ద్వారానికి గణపతిని ప్రతిష్ఠిస్తారు. ఉదయం లేవగానే నీటితో కడిగి పూజించి వెళ్తారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలోనూ ప్రధాన ద్వారంలో ఉన్న గణపతికి నమస్కరిస్తారు. తిరిగి వస్తూ మళ్లీ గణపతికి నమస్కరించాకే ఇంటిలోకి వెళ్తారు. ఏ ఆలయం నిర్మించినా ముందుగా గణపతి పూజలు చేస్తారు. గణపతి హోమాలు నిర్వహిస్తారు. ఇలా అందరికీ గణాధిపతి అయిన స్వామివారికి ముద్గల పురాణంలో 32 స్వరూపాలను వర్ణించారు. ఈ 32 స్వరూపాల్లో 16 రూపాలు అత్యంత ప్రాశస్త్యమైనవి.

పురాణాల్లో పేర్కొన్న రూపాలు

పురాణాల్లో వినాయకుడికి 32 స్వరూపాలుగా పేర్కొన్నారు. ఇందులో 16 రూపాలు అత్యంత ప్రాధాన్యమైనమని తెలిపారు. నేటి రోజుల్లో కళాకారులు గణపయ్యను అనేక రూపాల్లో మలుస్తున్నారు. ఈ 16 రూపాల్లో ఉన్న గణనాథులకు పూజలు చేస్తే మంచి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల్లో పేర్కొన్నట్లు బాలగణపతి, తరుణగణపతి, ఉచ్ఛిష్టగణపతి, విఘ్నగణపతి, మహాగణపతి, క్షిప్రగణపతి, హేరంబగణపతి, లక్ష్మీగణపతి, భక్తిగణపతి, వీరగణపతి, శక్తిగణపతి, ద్విజగణపతి, సిద్ధగణపతి, నృత్యగణపతి, ఊర్ధ్వగణపతి, విజయగణపతి.. ఇలా 16 ప్రధానమైన రూపాలున్నాయి.

ఆర్జీయూకేటీలో ముగిసిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్‌లో అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. వారం రోజులుగా కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు విద్య, వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు, నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అభివృద్ధి వంటి విభిన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ మహబూబ్, అసోసియేట్ డీన్‌లు చంద్రశేఖర్, మహేశ్, విఠల్, ఇంజినీరింగ్ విభాగాధిపతులు ఉపేందర్, భావ్‌సింగ్ వినయ్, కోఆర్డినేటర్ తేజస్వి, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈవోల బదిలీ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 66మంది సీఈవోలు ఉండగా, 49 మందిని వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మరో 17 సొసైటీల్లో రెగ్యులర్ సీఈవో లేకపోవడంతో వారికి ఎలాంటి బదిలీ జరగలేదు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేసినట్లు జిల్లా సహకారశాఖ అధికారి మోహన్ తెలిపారు.

డెంగీతో విద్యార్థి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్
- ఏఎన్‌ఎంను విధుల నుంచి తొలగింపు



ఆత్రం అనురాగ్ (ఫైల్)

తిర్యాణి: డెంగీతో ఓ విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిమాదర పంచాయతీ పరిధి రాజాగూడ గ్రామానికి చెందిన ఆత్రం సీతారాం–దివ్యజ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు ఆత్రం అనురాగ్ (12) స్థానిక ఆశ్రమ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఈనెల 14న అతడికి జ్వరం రావడంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చేర్పించారు. 15న వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించగా వ్యాధి నిరార్ధణ కాలేదు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో 18న రక్త పరీక్షలు నిర్వహించి తెల్లరక్త కణాలు తగ్గినట్లు గుర్తించారు. 19న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. ఈనెల 21న బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, ఎంపీడీవో మల్లేశ్ పరామర్శించారు. కాగా, తిర్యాణి సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది వ్యాధి నిర్ధారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి మూడు, నాలుగు రోజులు మామూలు వైద్యం అందించారని తల్లిదండ్రులు ఆరోపించారు. పరిస్థితి విషమించగా మంచిర్యాల ఆస్పత్రికి రిఫర్ చేశారని వాపోయారు. వైద్య సిబ్బంది సరైన చికిత్స అందించి ఉంటే తమ కొడుకు బతికేవాడని ఆవేదన వ్యక్తంజేశారు. కాగా, విద్యార్థికి జ్వరం వస్తున్నా ఉన్నతాధికారులకు తెలుపకుండా నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగర్‌ను సస్పెండ్ చేసినట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. అలాగే విధులను నిర్లక్ష్యం చేసిన ఏఎన్‌ఎం సువార్తను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాల హెచ్‌ఎంగా సీనియర్ ఉపాధ్యాయుడు తిరుపతికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



చందు (ఫైల్)

భీమారం: భీమారం గ్రామంలోని ఐటీడీఏ కాలనీకి చెందిన మారం చందు (42) మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. ఐటీడీఏలో నివాసముంటున్న చందు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొనేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 25న మద్యం మత్తులో ఇంట్లోనే ఉన్నాడు. ఈ క్రమంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. మృతుడికి భార్య సుజాత, కూతుళ్లు శ్రీవల్లి, శ్రీనిక ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



సుకేందర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కనే పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఆజ్మీర సుకేందర్ (27) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 15రోజుల క్రితం సుకేందర్ భార్య రాజేశ్వరి ప్రసవించగా కుమారుడు పుట్టి చనిపోయాడు. రాజేశ్వరి తల్లిదండ్రుల నిర్లక్ష్యంతోనే కొడుకు పుట్టగానే చనిపోయాడని ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుకేందర్ ఈ నెల 25న రాత్రి హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వచ్చి రాజీవ్‌నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బాను జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి



భోజన్న (ఫైల్)

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పశువుల కాపరి పొన్నవేని భోజన్న (48) కొత్త చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబకంటి గ్రామానికి చెందిన భోజన్న సోమవారం ఉదయం పశువులను మేపడానికి రోజులాగే గ్రామ శివారుకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కొత్త చెరువులో గజ ఈతగాళ్లతో గాలించగా మంగళవారం మృతదేహం లభించింది. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్

మంచిర్యాలక్రైం: గతేడాది గణేశ్ నవరాత్రోత్సవాల్లో జిల్లా కేంద్రంలో గొడవలకు పాల్పడిన 13మంది పాత నేరస్తులను మంగళవారం స్థానిక తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జరిగిన గణేశ్ నవరాత్రోత్సవాల్లో హింసాత్మక ఘటనలకు ప్రేరేపించిన వారిని, గొడవలకు పాల్పడినవారిని గుర్తించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అయినా తీరు మార్చుకోకుండా నేరాలు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై సత్తయ్య ఉన్నారు.

నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీలో ఓ వ్యక్తిని బెదిరించి నగదు దొంగిలించిన డీసీ సీటర్ ఖద్దర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగూడకు చెందిన ముత్యాలు ఆ ప్రాంతంలో చేపలు విక్రయిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన డీసీ సీటర్ ఖద్దర్ ముత్యాలును బెదిరించి రూ.1,500 దొంగిలించి పరారయ్యాడు. అంతేకాకుండా ముత్యాల పక్కనున్న శ్రీనివాస్‌పై దాడి చేశాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఖద్దర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అటవీ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని నంబాల గోదావరి తీరం వద్ద అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 15 టేకు దుంగలను మంగళవారం తమ సిబ్బంది పట్టుకున్నట్లు తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.42,329 ఉంటుందని పేర్కొన్నారు. కలపను రేంజ్‌కి తరలించినట్లు తెలిపారు. అటవీ సిబ్బంది ఎఫ్ఎస్‌వో నరేశ్, ఎఫ్‌బీవో నాగరాజుచారి, టైగర్ ట్రాకర్ ప్రశాంత్, బేస్ క్యాంప్ వాచర్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న తిర్పెల్లిలోని శ్రీనివాస వైన్స్‌లో ఐదుగురు దొంగతనానికి పాల్పడగా అందులో షేక్ బిలాల్, మహ్మద్ షారుఖ్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 6న సంజయ్‌నగర్ కాలనీకి చెందిన శానం నవీన్‌కుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన మార్కులే అనిల్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల బంగారం చోరీకి పాల్పడగా, నిందితుడి నుంచి అర తులం రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

నవోదయకు 6,091 దరఖాస్తులు

- ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు నేటితో పూర్తి
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష



నవోదయ విద్యాలయం

కాగజ్‌నగర్ టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం అన్ని వసతులతో పాటు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నిలుస్తోంది. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు గాను విద్యార్థుల నుంచి ఈ నెల 27 వరకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు 6,091 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,003 మంది బాలికలు, 3,088 మంది బాలుర దరఖాస్తులున్నాయి. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

దరఖాస్తుల వివరాలు

చెన్నూరు నుంచి 274 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఖానాపూర్ నుంచి 287, మంచిర్యాల నుంచి 510, కాగజ్‌నగర్ నుంచి 631, సిర్పూర్ నుంచి 378, ఆదిలాబాద్ నుంచి 571, బెల్లంపల్లి నుంచి 270, బోథ్ నుంచి 319, నిర్మల్ నుంచి 590, భైంసా నుంచి 664, లక్సెట్టిపేట్ నుంచి 350, మందమర్రి నుంచి 279, ఉట్నూర్ నుంచి 377, ఆసిఫాబాద్ నుంచి 591 వచ్చినట్లు పేర్కొన్నారు.

త్రిభాషా విధానం అమలు

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులు ఐదో తరగతి చదివి ఉండాలి. వరుసగా 3, 4, 5 తరగతులు ఒకే పాఠశాలలో చదివినవారే అర్హులు. విద్యార్థులు మే 1, 2014 నుంచి జూలై 31, 2016 మధ్యలో జన్మించి ఉండాలి. జవహర్ నవోదయ విద్యాలయంలో త్రిభాషా విధానం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు సోపానంగా నిలుస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు వంటి వసతులున్నాయి. అంతర్గత సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ఆరోగ్యాన్ని పంచే హరిత సంపద, సుశిక్షితులైన అధ్యాపకులు, స్మార్ట్ క్లాసులు, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటలకు బాసటగా విశాలమైన స్టేడియం, బాస్కెట్‌బాల్ తదితర మైదానాలు జిమ్, హెల్త్‌సెంటర్‌లతో నవోదయ ప్రత్యేకత చాటుతోంది. ఇక్కడ పుస్తకాలు, దుస్తులు సహా విద్యార్థులకు అన్నీ ఉచితమే. 6, 7 తరగతులకు మాతృబాషలో బోధిస్తారు. 8వ తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



2026–27 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



మాట్లాడుతున్న రీజినల్ కమిషనర్ గోవర్ధన్

రెబ్బెన: జాప్యం లేకుండా సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్–2 గోవర్ధన్ కంటిపుడి తెలిపారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సీకేర్స్ పోర్టర్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని, సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులు మధ్యవర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. సీఎంపీఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్, రివైజ్డ్ పెన్షన్‌పై ఎలాంటి పెండింగ్‌లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సీఎంపీఎఫ్ దరఖాస్తులు జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ప్రశాంత్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత, అన్ని విభాగాల సంక్షేమ శాఖ క్లరికల్ సిబ్బంది ఉన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ డబ్బులను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ–3 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.27వేల కోట్ల బకాయిలుంటే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.42 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. సమయానికి బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు పడుతోందని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ పాలన గాడి తప్పుతోందని తెలిపారు. గుర్తింపు సంఘంగా తాము గెలిచిన తర్వాత కార్మికుల ప్రధాన డిమాండ్లను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరగని స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించి కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల సాధనకు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తూ సాధనకు కృషి చేస్తున్నామని చెప్పారు. కంపెనీ వార్షిక లాభాలను ప్రకటించి అందులో నుంచి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రటరీ మురళీచౌదరి, ఆకుల లచ్చన్న, జాడి రాజకుమార్, కారుకూరి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.